డిమ్స్ కంప్యూటర్స్ 31వ వార్షికోత్సవం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : డిమ్స్ కంప్యూటర్స్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 35 మంది విద్యార్థులకు సంస్థ కార్యాలయంలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. శనివారం డిమ్స్ కంప్యూటర్స్ 31వార్షికోత్సవంలో భాగంగా విలేకరుల సమావేశంలో అధినేత కె.ఎస్.బి.కె.రాజు మాట్లాడుతూ నేడు విద్యార్థులకు అవసరమైన సి .లాంగ్వేజ్, పైతాన్ లాంగ్వేజ్, జావా, సి ప్లస్ ప్లస్, ఒరాకిల్, డిజిటల్ మార్కెటింగ్ మొదలగు కోర్సులలో అత్యుత్తమ శిక్షణ అందిస్తూ, ఐఎస్ఓ గుర్తింపు కలిగిన సర్టిఫికెట్ ఇస్తున్నట్లు సంస్థ అధినేత రాజు తెలిపారు. గత 31 ఏళ్లుగా సుమారు 40 వేలమంది విద్యార్థులు శిక్షణ పొందినట్లు చెబుతూ, ప్రస్తుతం వారు దేశవిదేశాల్లో అనేకరంగాల్లో స్థిరపడినట్లు తెలియజేసారు. రాబోయే కాలంలో ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ ఫర్ ఓవర్సీస్... ఇతర దేశాల్లో చదువుకోడానికి కావలసిన ఇన్ఫర్మేషన్ గైడెన్స్ త్వరలో డిమ్స్ కంప్యూటర్ ఆధ్వర్యంలో ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ భాగ్యలక్ష్మి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయం 8 గంటలకే కౌంటింగ్ ప్రారంభం

-వీలైనంత వేగంగా ఓట్ల లెక్కింపు
: జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

విశాలాంధ్ర-విజయనగరం: నిర్ణీత సమయం 8 గంటలకే ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభిం చాలని రిటర్నింగ్ అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. కౌంటింగ్, ఓట్ల లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తాజాగా ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన ఆదేశాలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. 4వ తేదీ ఉదయం 8 గంటలకే పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఖచ్చితంగా ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. దీనికోసం 7.30 గంటలకే ట్రంకు బాక్సులు లెక్కింపు కేంద్రాల్లోకి తరలించి, 500 చొప్పున కట్టలు కట్టి టేబుళ్ల వద్దకు చేర్చాలని సూచించారు. ప్రాథమిక లెక్కింపులో మొదటి రౌండ్ గంట సమయం తీసుకున్నప్పటికీ, రెండో రౌండ్ నుంచి మాత్రం 45 నిమిషాల్లో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండో దశలో చేపట్టే పోస్టల్ ఓట్ల సమగ్ర లెక్కింపు ప్రక్రియలో ఒక్కో రౌండ్ లెక్కింపు పూర్తి కావడానికి గంటన్నర కంటే ఎక్కువ సమయం తీసుకోకూడదని సూచించారు. ఈటిపిబి లెక్కింపు కూడా వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఖచ్చితంగా ఉదయం 7.30 గంటలకు స్ట్రాంగురూములను తెరవాలని, ఈ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేయించాలని చెప్పారు. ఉదయం 8.30 గంటలకు ప్రారంభమయ్యే ఈవిఎం ఓట్ల లెక్కింపులో ఒక్కో రౌండ్ 20 నిమిషాల లోపే పూర్తి చేయాలని ఆదేశించారు. అందుకు అనుగుణంగా 8.15 గంటలకే కంట్రోల్ యూనిట్లను కౌంటింగ్ టేబుళ్లవద్దకు చేర్చాలని సూచించారు. ప్రతీ రౌండ్ పూర్తయిన వెంటనే ఫలితాలను తప్పులు లేకుండా ఎన్‌కోర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని ప్రారంభించి, సజావుగా, వేగంగా ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ కోరారు. కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 6.45 గంటలకల్లా లెక్కింపు కేంద్రాలవద్ద సిద్దంగా ఉండేలా చూడాలని సూచించారు. లాటరీ ద్వారా ఎంపిక చేసిన 5 వివి ప్యాట్‌లను, సిద్దంగా ఉంచిన ప్రత్యేక క్యాబిన్‌లలోకి తరలించి, ఒక్కో దానిలోని స్లిప్పులను 30 నిమిషాల్లోపే లెక్కించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక ఫారమ్-20 రిజల్ట్ షీట్, ఫారమ్-21 సి, ఫారమ్-21 ఇ, ఫారమ్-22 తదితర పత్రాలను తప్పులు లేకుండా, ఖచ్చితమైన వివరాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. చిన్నపొరపాటుకు కూడా పెద్ద మూల్యం చెల్లించాల్సి వస్తుందని, ఎక్కడా ఎటువంటి పొరపాటు దొర్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ సెంటర్లలో ఏర్పాట్లన్నీ ఆదివారం సాయంత్రానికి పూర్తి చేయాలని, సిబ్బందికి 3వ తేదీన ప్రత్యక్ష శిక్షణ ఇప్పించాలని సూచించారు. కౌంటింగ్ ముగిసిన తరువాత నిబంధనల ప్రకారం ప్యాకింగ్, సీలింగ్ ప్రక్రియలను పూర్తి చేసి, మరునాడు ఉదయం వాటిని గోదాములకు తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ కు సంబంధించి ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన తాజా ఆదేశాలను కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఓ ఎస్‌డి అనిత, నోడల్ అధికారులు, వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఎఆర్ఓలు పాల్గొన్నారు.

ఎస్.కోట వేసవి శిక్షణ శిబిరంలో బ్యాడ్మింటన్ టోర్నీ

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట కేంబ్రిడ్జి నారాయణ పాఠశాలలో గత నెల రోజులుగా జరుగుతున్న వేసవి షటిల్ బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో భాగంగా చివరి దశలో క్రీడాకారుల మధ్య టోర్నమెంట్ ను నిర్వహిస్తున్నట్లు చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. శనివారం ఉదయం 6.00 గంటలకు ఈ పోటీలను చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ క్రీడాకారులను మినీ జూనియర్, సబ్ జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాలుగా విభజించి వారి గ్రూపుల మధ్య బాలురు బాలికలకు సింగిల్స్, డబుల్స్ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. శనివారం సింగిల్ పోటీలు నిర్వహించగా ఆదివారం డబుల్స్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కోచ్ లు మొహమ్మద్ అస్లాం, బి.హారిక, పి.మౌనికలు వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

చెలరేగిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు

జామిలో వరుసగా ఏడు ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీ

విశాలాంధ్ర-జామి: ఒకప్పుడు పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ ఉంటే మాయమయ్యే పరిస్థితి ఉండేది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఒక్కోసారి ట్రాన్స్‌ఫార్మర్‌లను కాపాడుకునేందుకు రాత్రిపూట కాపలా కాసేవారు. అనం తరం కొంత కాలం తరువాత దొంగలు ఈ ప్రాంతాన్ని వదిలిపెట్టడంతో రైతులు ఊపిరిపీల్చు కున్నారు. తాజాగా మండలంలో ఇప్పుడు అటువంటి దొంగతనాలు జోరందుకున్నాయి. నెలరోజుల వ్యవధిలోనే మండలంలోని పలు ప్రాంతాలలో 7 ట్రాన్స్‌ఫార్మర్‌లను దొంగలు తస్కరించారు. జామిలోని హైవే వద్ద పిఎన్‌కె కంపెనీకి చెందిన ట్రాన్స్ ఫార్మర్‌కూడా దొంగలించారు. అలాగే కొయ్యాన మహేష్ పొలం వద్ద, విజినిగిరి రహదారిలోనూ, చవిటి చెరువువద్ద, అన్నంరాజుపేటలోనూ పొలాల్లో ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌లు దొంగలపాలయ్యాయి. వరుస చోరీలతో రైతులు ఆందోళన చెందు తున్నారు. పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లను రైతులు తమ సొంత డబ్బులతో వేయించు కుంటారు. తిరిగి మరోసారి ట్రాన్స్‌ఫార్మర్ వేయాలంటే విద్యుత్ అధికారులు తస్కరణకు సంభందించి పోలీసులనుంచి ఎఫ్ఐఆర్ కాపీను రైతులే తీసుకుని రావాలని నిభందన పెట్టారు. దీంతో ఒకవైపు పొలాలలకు నీరు లేక, మరోవైపు పోలీసు స్టేషన్ చుట్టూ తిరగలేక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ దొంగలను పట్టుకుని దొంగతనాలను నివారించాలని రైతులు కోరుతున్నారు.

చెరువుల్లో అనుమతులు లేకుండా చెట్లను తొలగించిన వారిపై కేసులు నమోదు చేయాలి

సిపిఐ డిమాండ్

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణంలో గల ఫ్లై ఓవర్ పక్కన మిలటరీ కాలనీ ఆనుకుని ఉన్న ప్రభుత్వ చెరువును ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా జేసీబి తో చదును చేసి. చెరువులో ఉన్న చెట్లను తొలగించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న ప్రభుత్వ చెరువును పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా బొబ్బిలి రెవిన్యూ ఇన్స్పెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, విఆర్ఓ శ్రీనివాసరావు, గొల్లపల్లి లలిత లకు సిపిఐ ధన్యవాదాలు తెలిపారు. వెంటనే స్పందించి చెరువులో పూడికి పనులు నిలిపివేసి జెసిబి ని సీజ్ చేసినందుకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి కి. వీఆర్వో శ్రీనివాసరావు. లలిత కు సిపిఐ పార్టీ తరఫున అభినందనీయులు అన్నారు. అలాగే అదే చెరువు పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమణ చేయగా గతంలో సిపిఐ పార్టీ తరఫున రెవెన్యూ అధికారులు కు తెలియజేయడంతో రెవెన్యూ అధికారులు చొరవతో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసిన విచేయడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం చదునుచేస్తున్న చెరువులో ఉన్న చెట్లను ఎటువంటి అనుమతులు లేకుండా నరికి వేసి తొలగించినవ్యక్తుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

పట్టణంలో అనుమతి లేని లే-ఔట్ల పై చర్యలు చేపట్టాలి

మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణంలో మున్సిపల్ అనుమతులు లేకుండా లేఔట్లు కేసులు యజమానులు పైన , భవన నిర్మాణంలో టౌన్ ప్లానింగ్ నుండి అనుమతులు లేని అపార్ట్మెంట్ల పైన గృహాలు పైన చర్యలు చేపట్టాలని అందుకు ప్లాన్లను పరిశీలన చేయాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారి ను వరప్రసాద్ ను ఆదేశించారు. శనివారం మున్సిపల్ కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు, ఇన్చార్జి శానిటరీ ఇన్స్పెక్టర్, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు, ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు మరియు వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలతో పూల్ బాగ్ మరియు కుమ్మరి వీధి సచివాలయాల పరిధి లో పర్యటించారు.గొల్లవీధి, అప్పయ్యపేట రోడ్డులో ఉన్న లే అవుట్లను పరిశీలించి అప్పుడు వాళ్ళు ఉన్నది లేనిది టౌన్ ప్లానింగ్ అధికారి వరప్రసాద్ ను అడిగి తెలుసుకున్నారు. ఎలక్ట్రికల్ ఆఫీస్ వెనుక ఉన్న అపార్ట్మెంట్లను పరిశీలించి అన్ని అపార్ట్మెంట్లకు ప్లాన్లు మరియు అప్రూవల్ లను పరిశీలించారు. పట్టణ పరిధిలో ఉన్న అన్ని లేఔట్లకు మరియు అపార్ట్మెంట్లకు వున్న పర్మిషన్లను పరిశీలించాలని టౌన్ ప్లానింగ్ అధికారి వరప్రసాద్ ను మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు .తదుపరి కుమ్మరి వీధి సచివాలయ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించి వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీ కి జారీ చేశారు.

కొండంపేటలో అనాధ వృద్ధాశ్రయం ప్రారంభం

విశాలాంధ్ర-రాజాం : రాజాం మున్సిపాలిటీ పరిధి కొండంపేటలో అనాథ వృద్ధాశ్రమం నూతన ప్రారంభోత్సవ భవనం ఈ రోజు పెదపూడి శ్రీనివాసు, విజయ భారతి దంపతులు ఆధ్వర్యంలో నిర్మించిన అనాథ వృద్ధాశ్రమం సుమారు ఏభై మంది అనాథ వృద్ధులకు సరిపడ ఆధునిక వసతులతో మోనంగి ఆదినారాయణ , ప్రమీలకుమారి దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ తలే రాజేష్, పాలవలస శ్రీనివాసరావు, మక్క అప్పలనాయుడు, పెంకి చైతన్య కుమార్, గట్టి పాపారావు, బివిఅచ్చుతు కుమార్,కొత్త అనంతరావు చంద్ర వతి దంపతులు, రెడ్డి విజయ్‌కుమార్, శెట్టి పోలరావు, మానం వెంకటేష్, దుప్పలపూడి శ్రీను, సలాది తులసి దాస్, ముద్దన సత్యరావు, ఆర్ వి ఎస్ సి కిషోర్ కుమార్, సూరిబాబు , ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న హైందవి, తదితరులు పాల్గొన్నారు . ఈ భవనం ప్రారంభం సర్వమత సమ్మేళనం గా హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలతో ప్రార్థనలు చేసి ప్రారంభించడం జరిగింది..

వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మృతి

విశాలాంధ్ర-గజపతినగరం: మండలంలోని లోగిస గ్రామానికి చెందిన సామంతుల పైడిరాజు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గజపతినగరం వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గురువారం ఉదయం మార్నింగ్ వాకింగ్ కి వెళ్ళగా మార్గమధ్యంలో పాము కాటు వేసింది అనంతరం ఆయన స్పృహతప్పి పడిపోగా ఆయనను విజయనగరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలు అందించారు కానీ అప్పటికి పరిస్థితి విషమించడంతో ఆయన శనివారం తెల్లవారుజామున మృతి చెందారు ఆయన మృతి చెందిన వార్త తెలియగానే మండలంలోని వైసీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు.

4న మద్యం దుఖాణాలు మూసివేత : కలెక్టర్

విశాలాంధ్ర-విజయనగరం: ఓట్ల లెక్కింపు జరిగే జూన్ 4వ తేదీన జిల్లాలో మద్యం షాపులన్నిటినీ మూసివేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు జిల్లాలోని అన్ని ప్రభుత్వ మద్యం దుఖాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, సంకిలి లోని డినేచర్డ్ ఇథనాల్ యూనిట్, డినేచర్డ్ స్పిరిట్ మొలాసిస్ యూనిట్స్, మెథనాల్ యూనిట్లు, కల్లు దుఖాణాలను మూసివేయాలని కలెక్టర్ ఆదేశించారు. 3వ తేదీ సాయంత్రం 6 గంటలు నుంచి 4వ తేదీ మంగళవారం రోజంతా వీటన్నిటినీ మూసివేస్తున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఈ డ్రైడే నిబంధనలను పాటించాలని ప్రకటనలో కోరారు. డ్రైడే రోజు మద్యం సేవించడం, కలిగి ఉండం, త్రాగడం నేరమని, దానిని అతిక్రమించినవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు..

హనుమజ్జయంతి సందర్భంగా 'సారె' సమర్పణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: హనుమజ్జయంతి పురస్కరించుకుని శనివారం శ్రీ పంచముఖ ఆంజ నేయ స్వామి దేవాలయం కు వాసవీ ఫౌండేషన్ 45 రకాల స్వీట్స్ అంద జేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు మండవిల్లి వెంకరాజు మాట్లాడుతూ ఆంజనేయునికి 9 అంకె చాలా ఇష్టం కాబట్టి స్వీట్లు ఆవిదంగా ఏర్పాటు చేసి అందజేసినట్లు చెప్పారు. రంగుల కాగితాలతో ఆకర్షణీయంగా అలంకరించిన పళ్లెల్లో స్వీట్స్ పెట్టి ప్రధాన ద్వారం వద్ద ఉంచారు. ఇవి భక్తులను ఎంతో ఆకట్టుకున్నాయి. అనేకమంది భక్తులు 'జైశ్రీరామ్'అంటూ శరణ ఘోషతో సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఏడుకొండలు, నేతి నరసింహారావు,విశ్వేశ్వరరావు,పెంటపాటి ముత్యాలు,వంకాయల దాలయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి జయంతి వేడుకలు

మెంటాడ: మండలంలోని జీటి పేట గ్రామంలో ఆలయ కమిటీ చైర్మన్ చొక్కాకు సన్యాసినాయుడు ఆధ్వర్యంలో శనివారం ఉదయం అభయాంజ నేయస్వామి జయంతి వేడుకలు జరిగాయి. జీ.టి.పేట గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయంలో వైభవంగా వేడుకలు జరిపారు. స్వామివారికి విశేష అభిషేక పూజలతో పాటు పంచకుండాత్మక హనుమాన్ కవచహపనం, పూజలు, యజ్ఞాలు, నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో ఉన్న భక్తులందరూ పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకుని పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పూజలు జరిపారు. అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ చొక్కాకు సన్యాసినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ఆంజనేయస్వామి భక్తులు గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి వేడుకల్లో కోళ్ల దంపతులు

శృంగవరపుకోట: హనుమాన్ జయంతి వేడుకల్లో శృంగవరపుకోట నియోజక వర్గ ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాం ప్రసాద్ తదితరులు స్థానిక నాయకులతో కలిసి శనివారం పాల్గొన్నారు. ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

రాజాం: రాజాం పరిసర ప్రాంతాల్లో పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత భక్తిశ్రద్దలతో నిర్వహించారు. మహాదాసం బాల్జి, కుమారి దంపతులు, శ్రీనివాసరావు లక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో అమ్మవారి కాలనీలో ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహానికి తమలపాకులు మాలలు వేసి, సింధూర పూజలు చేసి హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని పుష్పాలతో అలంకరించారు. పరిసర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు వెంకటరమణ పంతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంపల లక్ష్మణరావు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అన్న సమారాధన

లక్కవరపుకోట: మండలంలోని తామరపల్లి గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా భక్తిశ్రద్ధలతో గ్రామ ప్రజలు పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలు సమర్పించి ఈ ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు కండి పల్లి. ఈశ్వరరావు సొంత ఆర్థిక సహాయంతో సుమారు 1000 మంది నిరుపేదలకు , వృద్ధులకు, వికలాంగులకు భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని సంతృప్తిగా భోజనం చేసి హనుమాన్ జయంతి వేడుకల్లో ఘనంగా పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు గురు వెంకటరమణ, మాజీ ఉపసర్పంచ్ కండి పల్లి సత్యం, ఏర్నా యుడు, గండి శ్రీరామ్ మూర్తి, రంది ప్రసాద్ తదితర గ్రామ పెద్దలు నాయకులు పాల్గొన్నారు.

రామభద్రపురం: మండలంలోని రామభద్ర పురం, ఆరికతోట, తారాపురం, మిర్తి వలస, తదితర గ్రామాలలో శనివారం ఆంజనేయ స్వామి పుట్టినరోజు సందర్భంగా మహిళలు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి మహిళలు పసుపు కుంకుమలు టెంకాయలతో పూజలు చేశారు. అలాగే అన్న సామ్రాధన కార్యక్రమం కూడా ఆయా గ్రామాలలో చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మృతదేహం ఆచూకీ తెలియజేయండి..

పట్టణ సీఐ నాగేశ్వరరావు

విశాలాంధ్ర-బొబ్బిలి: మండలం రాముడు వలస గ్రామ శివారులో, తోటపల్లి కెనాల్ గట్టు వద్ద సుమారు 45 నుండి 50 సంవత్సరాల వయసుగల పురుషుడి మృతదేహం పడి ఉందని స్థానికులు గ్రామ రెవెన్యూ అధికారి అలజంగి అప్పారావు కు సమాచారం ఇవ్వడం తో గ్రామ రెవెన్యూ అధికారి బొబ్బిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్ఐ లోవ రాజు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహం పూర్తిగా కుళ్ళిపోవడంతో సంఘటన స్థలం వద్ద పోస్టుమార్టం నిర్వహించారు. మృత దేహం శరీరంపై నీలంరంగు కలిగిన చొక్కా మరియు ఎడమకాలుపై గల లుంగీ ఉండి, ముఖం పురుగులు పట్టి, శరీరం నల్లగా మారిపోయి ఉందని మృతుడి ఆచూకీ కోసం తెలిసిన వారు పట్టణ సిఐ నాగేశ్వరరావు ను పోలీసుస్టేషన్ లో వివరాలు తెలియజేయాలని కోరారు.

పుస్తక పఠనం, యోగాపై శిక్షణ

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం శాఖా గ్రంధాలయం లో వేసవి విజ్ఞాన శిభిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు యోగ క్లాస్ మరియు పుస్తక పఠనం నిర్వహించడం అయింది.ఈ యోగ క్లాస్ వలన విద్యార్థి విద్యార్థులకు మానసిక ఉల్లాసానికి, శరీర ధృఢత్వానికి ఉపకరిస్తుంది అని అతిథిగా వచ్చిన హైస్కూల్ టీచర్ కె. విస్సు తెలిపారు.ఈ యోగ క్లాస్ లో పిల్లల చే పద్మాసనం , భుజంగాసనం , సూర్యనమస్కారం నేర్పించడం జరిగింది. విద్యార్థి, విద్యార్థుల చే కథల పుస్తకాలు పఠనం చేయించడం జరిగింది అని స్థానిక గ్రంధాలయ అధికారి సి.హెచ్ కృష్ణమూర్తి తెలిపారు.

కౌంటింగు కేంద్రాల వద్ద మూడంచెల భద్రత : ఎస్పీ దీపిక

కౌంటింగు ప్రక్రియ నిర్వహించే రోజున ట్రాఫిక్ మళ్ళింపులు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తదుపరి జూన్ 4న ఎన్నికల కౌంటింగు చేపట్టే జె.ఎన్.టి.యు, లెండి ఇంజనీరింగు కళాశాలల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మూడంచెల భద్రతను ఏర్పాటు చేసామని జిల్లా ఎస్పీ ఎం.దీపిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో తెలిపారు. మూడంచెల భద్రతలో భాగంగా స్ట్రాంగు రూమ్స్, కౌంటింగు కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు భద్రత విధులు నిర్వహిస్తాయన్నారు. తదుపరి ఆర్మ్ డ్ రిజర్వు, ఎపిఎస్పీ బలగాలు స్ట్రాంగు రూమ్స్, కౌంటింగు నిర్వహించే భవనాలు చుట్టూ భద్రత విధులు నిర్వహిస్తారని, తదుపరి సివిల్ పోలీసులు భద్రత విధులు నిర్వహిస్తున్నారన్నారు. వీరు కాకుండా ఇంజనీరింగు కళాశాల భవనాలకు 2 కి.మీ.ల పరిధిలో కట్ ఆఫ్ పార్టీలు పహారా కాస్తుంటాయన్నారు. ఈ ప్రాంతాల్లోకి కౌంటింగు విధులు నిర్వహించే ఉద్యోగులు, ఆథరైజేషను లెటర్స్ ఉన్న ఏజంట్లు, మీడియా వారిని మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. కౌటింగు నిర్వహించే రోజున జిల్లా వ్యాప్తంగా 144 సిఆర్పిసి అమలులో ఉన్నందున, ఎక్కడా కూడా గుంపులుగా మనుష్యులు ఉండకూడదన్నారు. అంతేకాకుండా, విజయోత్సవ ర్యాలీలు, మందుగుండు వినియోగానికి ఎటువంటి అనుమతులు లేవని స్పష్టం చేసారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలు, మందుగుండు సామగ్రిని వినియోగిస్తే, వారిపై ఐపిసి కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి జూన్ 6 వరకు అమలులో ఉన్నందున, కౌంటింగు రోజున ఎన్నికల నిబంధనలు ఎవరు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగు పూర్తయి, ఫలితాలు వెల్లడైన తరువాత అల్లర్లు జరిగేందుకు అవకాశం ఉన్న 100 గ్రామాలను ముందుగా గుర్తించి, ఆయా గ్రామాల్లో శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ముందుగా పికెట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంతేకాకుండా, సమస్య ఎక్కడ ఉత్పన్నమైనా, వెంటనే స్పందించేందుకు ప్రత్యేకంగా క్విక్ రియాక్షన్ టీమ్స్ ను కూడా ఏర్పాటు చేసామన్నారు. ఈ బృందాలు సిఐలు లేదా ఎస్ఐల ఆధ్వర్యంలో పని చేస్తాయని, వీటితోపాటు ఈ గ్రామాలన్నింటిని కవర్ చేస్తూ ప్రత్యేకంగా పెట్రోలింగు బృందాలను కూడా ఏర్పాటు చేసామని తెలిపారు. కౌంటింగు కేంద్రాల్లోకి వెళ్ళే ఏజంట్లు తమ వెంట మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, స్మార్టు వాచ్లు, క్యాలిక్యులేటర్లు, భోజనాలు, వాటర్ బాటిళ్ళను అనుమతించమన్నారు. కావున, ఎవ్వరూ కూడా తమ వెంట ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ ను తీసుకొని రావద్దని విజ్ఞప్తి చేసారు. ఏజంట్లు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్ధులు, ముఖ్య అధికారులు, ముఖ్యమైన వ్యక్తుల వాహనాలను పార్కింగు చేసేందుకు వేరు వేరుగా పార్కింగు ఏర్పాట్లు చేసామన్నారు. ఎన్నికల కౌంటింగు ప్రక్రియ ప్రశాంతయుతంగా ముగిసేందుకు పోలీసుశాఖ చేపట్టిన భద్రత చర్యలకు ప్రజలు, నాయకులు సహకరించాలని కోరారు. కౌంటింగు కేంద్రాల వద్ద రెడ్ జోన్ లను ఏర్పాటు చేసామని, రెడ్ జోన్ పరిధిలో ఎవ్వరూ కూడా డ్రోన్లును వినియోగించడాన్ని నిషేధించామన్నారు. కౌంటింగు ప్రక్రియకు ఎటువంటి విఘాతం కలగకుండా చర్యలు చేపట్టామని, ఎవ్వరైనా ఉద్దేశ్య పూర్వకంగా కౌంటింగు నిలిపేందుకు ప్రయత్నిస్తే, రిటర్నింగు అధికారి ఆదేశాలతో వారిని కౌంటింగు కేంద్రాల బయటకు పంపేయడంతోపాటు, వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ఎం.దీపిక హెచ్చరించారు. కౌంటింగు ప్రక్రియ చేపట్టే జూన్ 4న విశాఖ పట్నం - విజయనగరం, విజయనగరం - విశాఖపట్నం, గజపతినగరం -విశాఖ వైపు వెళ్ళే వాహనాల ట్రాఫిక్ మళ్లించనున్నట్లుగా తెలిపారు. ట్రాఫిక్ మళ్ళింపులను ప్రజలందరూ గమనించాలని, పోలీసుశాఖకు సహకరించాలని కోరారు.

విశాఖ-విజయనగరం వైపు వచ్చే వాహనదారులకు సూచనలు

విశాఖపట్నం నుండి విజయనగరం వైపు వచ్చే వాహనాల మహరాజుపేట మీదుగా నాతవలస జాతీయ రహదారి వైపు మళ్ళిస్తామన్నారు. మోదవలస జంక్షన్ వరకు వచ్చిన వాహనదారులను మోదవలస జంక్షన్ వద్ద గల శిల్ప మెడికేర్ మీదుగా నాతవలస వైపు జాతీయ రహదారి వైపుకు మళ్ళిస్తామన్నారు.

విజయనగరం-విశాఖ వైపు వెళ్ళే వాహనదారులకు సూచనలు

విటి అగ్రహారం వై-జంక్షన్ వద్ద చెక్ పోస్టును ఏర్పాటు చేసి, విశాఖపట్నం వైపు వెళ్ళే వాహనాలను రామనారాయణం మీదుగా కొత్తవలస లేదా పద్మనాభం వైపు మళ్ళిస్తామన్నారు. అయినాడ జంక్షన్ వరకు వచ్చే వాహనాలను చింతలవలస, గంట్లాం మీదుగా అక్కివరం జాతీయ రహదారి వైపు మళ్ళిస్తామన్నారు. జొన్నాడ వరకు వచ్చే వాహనదారులను చింతలవలస, గంట్లాం మీదుగా అక్కివరం జంక్షన్ జాతీయ రహదారి వైపు మళ్ళిస్తామన్నారు.

గజపతినగరం-విశాఖ వైపు వెళ్ళే వాహనదారులకు సూచనలు

గజపతినగరం వైపు నుండి వచ్చే వాహనాలను గొట్లాం బైపాస్ రోడ్డు మీదుగా కోరాడపేట బ్రిడ్జి క్రింద నుండి చిన్నాపురం లేదా కొత్తవలస వైపు మళ్ళిస్తామన్నారు. కావున, కౌంటింగు రోజున ప్రజలందరూ ఈ ట్రాఫిక్ మళ్లింపులను గమనించి, పోలీసుశాఖకు సహకరించాలనిజిల్లా ఎస్పీ ఎం.దీపిక కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అదనపు ఎస్పీ శ్రీమతి అస్మా ఫర్హీన్ గారు,స్పెషల్ బ్రాంచ్ సిఐ కే.కే. వి. విజయనాథ్, వన్ టౌన్ సిఐ బి. వెంకటరావు పాల్గొన్నారు.

జీతాల బకాయిలు, ఏరియర్స్ తక్షణమే చెల్లించాలి

విశాలాంధ్ర-విజయనగరం రూరల్: ఆర్టీసీ జోనల్ వర్క్ షాప్ లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. తులసీరామ్ డిమాండ్ చేశారు. శనివారం యూనియన్ గౌరవ అధ్యక్షులు ఏ.జగన్ మోహన్ రావు అధ్యక్షత న జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పేరుకు ప్రభుత్వ సంస్థ అయినా ఏ నెలలో కూడా సకాలంలో జీతాలు చెల్లించడం లేదని, ఏప్రిల్ నెల వేతనం నేటికీ చెల్లించకపోతే కార్మికులు ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. డిపీటీవోలు, డిఎం లు సకాలంలో జీతాలు చెల్లించమని అడుగుతున్న కార్మికులపై ఎదురుదాడికి దిగుతున్నారని, ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని ధ్వజమెత్తారు. విజయ నగరం జోనల్ వర్క్ షాప్ వర్క్ మేనేజర్ తక్షణమే కలుగజేసుకుని ఇక్కడ కార్మికులకు ఏప్రిల్, మే నెల వేతనాలు తక్షణమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వ్యాధులు ప్రబలకుండా స్ప్రేయింగ్

ఇంకుడు గుంతలలో నిలువ నీటిని పారవేద్దాం



విశాలాంధ్ర-మెంటాడ: మండలంలో అన్ని గ్రామీణ ప్రాంతాల్లో ప్రాంతానికి దీటుగా ఎండలు మండుతున్న నేపథ్యంలో గడచిన నాలుగు రోజులుగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్ర ప్రతాపం చూపిస్తున్నప్పటికీ, మధ్యాహ్నానికి ఆకాశం మేఘావృతమై కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ ముందు జాగ్రత్తగా మన్య ప్రాంతంలో స్ప్రేయింగ్ కార్యక్రమం నిర్వహిస్తుంది. మన్య ప్రాంతంలో దోమల ముందు పిచికారి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ ఉషశ్రీ అన్నారు. చల్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఈవో శ్రీనివాస రావు ఆధ్వర్యంలో శనివారం కొండ లింగాల వలస గ్రామాలలో దోమల ముందు పిచికారి పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యంలో ఒకవైపు ఎండలు మండుతుండగా మరోవైపు చెదురుమదురు వర్షాలు పడుతున్న నేపథ్యంలో చిన్నపాటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ఏమాత్రం చిన్నపాటి నీరసంగా ఉన్నా, జ్వరాలు, దగ్గు జలుబు తదితర రుగ్మతలు ప్రబలిన వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందాలని ఆయన సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిచ్చి మొక్కలు, మురుగు కాలువలను తొలగించుకోవాలన్నారు. పిచ్చి మొక్కలు మురుగు కాలువల వలన దోమలు వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని వాటి వల్ల మలేరియా, ఫైలేరియా, టైఫాయిడ్, డయేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయన్నారు. కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని, వేడి పదార్థాలను మాత్రమే భుజించాలని సూచించారు. ఎండ వేడితో పాటు మామిడిపళ్ళ సీజన్ కావడంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఆరోగ్య సంరక్షకురాలు (ఏఎన్ఎం) హెచ్ వి రవణమ్మ ఎం. ఎల్. హెచ్.విలు వైద్య సిబ్బంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప క్రిష్ణ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర -శృంగవరపుకోట : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప క్రిష్ణ 44వ పుట్టినరోజు వేడుకలను పార్టీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్.కోటలోని గొంప క్రిష్ణ స్వగృహంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, నాయకులు జుత్తాడ రామసత్యం, ఆదారి రమేష్, గోపాలపల్లి గ్రామ సర్పంచ్ ఆదారి మహేశ్వరరావు, ఐటీడీపీ హరి తదితరులు గొంప క్రిష్ణను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు శ్రీవేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేసి నిండు నూరేళ్ల పాటు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. గొంప క్రిష్ణ తనను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరికీ మిఠాయిలు పంపిణీ చేసి వారి క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.

పించన్ల పంపిణీలో ఆలసత్వం లేదు

ఎంపిడివో తిరుమలరావు

విశాలాంధ్ర-జామి: మండలంలో ప్రతీ నెలా పించన్ల పంపిణీ సక్రమంగా జరుగుతోందని, ఈనెల సైతం ఎటువంటి ఆలసత్వం లేకుండా పంపిణీ సాగుతోందని ఎంపిడివో తిరుమల రావు తెలిపారు. శనివారం పించన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పలు గ్రామాలలో పర్యవేక్షించారు. ఉదయం 7గంటలకే లొట్లపల్లి, భీమసింగి, కుమరాం, మొకాసాకొత్తవలస, అన్నంరాజుపేట తదితర గ్రామాలలో ఆయన సందర్శించి పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలుచోట్ల ఆయనే పించన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వనిర్ణయం మేరకు కొన్ని పించన్లు లబ్ధిదారుల బ్యాంకుఖాతాలలో జమ అయ్యాయని, మరికొందరికి సచివాలయ సిబ్బంది నేరుగా ఇంటి వద్దకే వెళ్ళి లబ్ధిదారులకు పించన్ ఇస్తున్నారని తెలిపారు.

శ్రీజిల్లెలమూడి అమ్మవారికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర -శృంగవరపుకోట: ఎస్.కోటలోని దత్తసాయి ఆలయంలో శ్రీజిల్లెలమూడి అమ్మవారు, మహా కాళేశ్వర విగ్రహ ప్రతిష్ఠ జరిగి 41 రోజులు పూర్తయిన సందర్భంగా విశేష పూజలు, పంచామృతాభిషేకం, హెూమం, అన్నసమారాధన కార్యక్రమాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంబులెన్స్ యాక్సిడెంట్ లో మెసెంజర్ మృతి

విశాలాంధ్ర-బాడంగి: మండలంలో ఎమ్మార్సీ కేంద్రంలో పనిచేస్తున్న మెసెంజర్ నిండుకుండ రాము విధి నిర్వహణలో ఉంటూ అనారోగ్యం పాలై బాడంగి వైద్యశాల నందు చికిత్స పొందుతూ మెరుగైన చికిత్సకోసం విజయ నగరం తరలిస్తుండగా అంబులెన్స్ యాక్సిడెంట్ కు గురై శనివారం అకాల మరణం చెందాడు. తన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని మండల బాడంగి మండల ఉపాధ్యాయ మండల రిసోర్స్ కేంద్ర సిబ్బంది కోరుకుంటున్నాం. వారి కుటుంబానికి మన అందరి ప్రగాఢ సానుభూతిని వారంతా తెలియచేసారు.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం : డిఎంహెచ్ఓ భాస్కరరావు

విశాలాంధ్ర-జామి: మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా, పరిసరాల పరిశుభ్రతను పాటించి ప్రజలు సహకరిం చాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎస్ .భాస్కరరావు సూచించారు. శనివారం ఉదయం జామి పిహెచ్సిలో మలేరియా నివారణ మాసోత్సవాల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని డిఎంహెచ్ఓ ప్రారంభించారు. ర్యాలీ అనంతరం ఆయన మాట్లాడుతూ తమ చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా, దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు సహకరించాలన్నారు. మలేరియా ప్రభావిత ప్రాంతాలైన కొట్టం, మెంటాడ, పీఎం పాలెం పీహెచ్సీల పరిధిలో దోమల నివారణకు ప్రత్యేకంగా మలేరియా స్ప్రేయింగ్ ను నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలీలో మలేరియా నివారణకు సంబంధించి పలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యాధికారిణి డా. ఆర్. సామ్రాజ్యలక్ష్మి, జిల్లా మలేరియా అధికారి వై. మణి, ఏపీడిమియాలజిస్ట్ డా. వెంకటేష్, చంద్రశేఖర్ రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్ ప్రేమ్ కుమార్, సిహెచ్ఓ ఫ్లోరెన్స్ , హెచ్. వి భవాని, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఎన్నికలపై ప్రజలకు బొబ్బిలి డిఎస్పీ అవగాహన

విశాలాంధ్ర- తెర్లాం: మండలంలో బూరిపేట గ్రామంలో ఎలెక్షన్ సంబంధించి ప్రజలకు బొబ్బిలి డి ఎస్ పి అవగాహన కల్పించడం జరిగింది. రోడ్ ఆక్సిడెంట్స్ కు సంబందించి ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలి అని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది.

మెంటాడ మండలం లో మలేరియా వ్యతిరేక మహోత్సవం

విశాలాంధ్ర-మెంటాడ: మెంటాడ మండలం మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంవద్ద డాక్టర్ కల్పన మరియు చల్లపేట ప్రాథమిక వైద్యాధికారి కైలాం గ్రామంలోఉషశ్రీ ఆధ్వర్యంలో శనివారం మలేరియా వ్యతిరేక మహెూత్సవం ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్లు మాట్లాడుతూ దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని, నీరు నిలవకుండా చూడాలని పరిసరాల పరిశుభ్రత చూసుకోవాలని గ్రామస్తులను కోరుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కల్పన మాట్లాడుతూ పిచ్చి మొక్కలు మురికి కాలువలను తొలగించుకోవాలని అన్నారు. పిచ్చి మొక్కలు మురికి కాలువలు ఉండడం వలన దోమలు పెరుగుతాయని తద్వారా మలేరియా, డెంగ్, టైఫాయిడ్, డయేరియా, ఫైలేరియా మొదలగు వ్యాధులు వ్యాపిస్తాయని ఆమె తెలియజేశారు. కాచి చల్లార్చిన నీరు త్రాగాలని వేడి పదార్థాలు మాత్రమే భుజించాలని ఆమె చూపించారు. ఈ కార్యక్రమంలో మెంటాడ సిహెచ్ఓ యస్. సత్యనారాయణ హెచ్ వి జ్యోతి చల్లపేట ఈవో శ్రీనివాసరావు హెచ్.వి రవణమ్మ ఎం. ఎల్. హెచ్.వి మరియు ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం మహిళా కళాశాలలో ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర -శృంగవరపుకోట: ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గల హైస్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్ (మహిళా జూనియర్ కళాశాలలో) ఇంటర్మీడియట్ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయని హెచ్ఎం బి. ఉమామహేశ్వరరావు తెలిపారు. తరగతులు ప్రారంభించిన సందర్భంగా హెచ్.ఎం మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1వ తేదీ నుండి హైస్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్ (మహిళా జూనియర్ కళాశాల) ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు సంబంధించిన తరగతులను ప్రారంభించామన్నారు. ఎస్.కోటకు సమీప దూరంలోనే గల ఈ హైస్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్ (మహిళా కళాశాల) లో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ తదితర కోర్సులకు ప్రభుత్వం అనుమతించిందని, ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు అర్హత, అనుభవము కలిగిన పిజిటి అధ్యాపకులను ప్రభుత్వం గత సంవత్సరమే నియమించిందన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన బాలికలు ధర్మవరం హైస్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్ (మహిళా జూనియర్ కళాశాల) లో చేరాలని హెచ్ఎం బి ఉమామహేశ్వరరావు, పిజిటి అధ్యాపకులు విద్యార్థినిలకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బి.ఉమామహేశ్వరరావు, పిజిటి అధ్యాపకులు పి.శివాజీ (బోటనీ), రహీం షేక్ లాల్(తెలుగు), టీ.రాజేష్ (కెమిస్ట్రీ), కే జయలక్ష్మి(ఫిజిక్స్), ఎస్వీఎన్ ఎన్ మూర్తి(సతీష్ మాస్టర్)(ఇంగ్లీష్), ఏ సురేంద్రనాథ్(జువాలజి) పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు..

గారెల దండలు,తమలపాకులతో శ్రీఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేసిన దృశ్యం

విశాలాంధ్ర -శృంగవరపుకోట : మండలంలోని ఎస్.కోట, బొడ్డవర, తిమిడి, వశి, ధర్మ వరం, భవానీనగర్, ముషిడిపల్లి, వెంకట రమణపేట తదితర గ్రామాల్లో హను మజ్జయంతి వేడుకల ను శనివారం ఘనం గా నిర్వ హించారు. ఆంజ నేయ స్వామిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎస్.కోటలోని పెదఖండపల్లి రహదారిలో గల షిర్డీసాయి నాధుని ఆలయంలోను, ఎస్.కోట బ్రాహ్మణ వీధిలోని శ్రీ కోదండరాముని ఆలయంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేకంగా తమలపాకులు, గారెల దండలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఎస్.కోటలోని గౌరీనగర్, పుణ్యగిరి రోడ్డులో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

అంగరంగ వైభోగంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర -వంగర : గ్రామాల్లో అంగరంగ వైభవంగా హనుమాన్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. మండలంలో ప్రతీ గ్రామంలో జయంతి ఉత్సవాలు ఘనంగాఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఆరతులు, అభిషేకాలు నిర్వహించారు. ఎక్కడ చూసినా హను మంతుని కథలు, గీతాలతో దివ్య వాతావరణం నెల కొంది. పూజలు, ఉత్సవాల అనంతరం భక్తులకు ప్రసాదాలు పంచటం, గ్రామాల్లో అన్న సమారాధన కార్యక్రమాలను జరిపారు. మన పండుగల్లో హనుమాన్ జయంతి ముఖ్యమైంది. ఆంజనేయస్వామి ధైర్యానికి ప్రతీక.శక్తిసామర్థ్యాలకు ప్రతిరూపం. సముద్రం దాటి లంక చేరాడు. ఆకాశమార్గంలో పయనించి సీతమ్మవారి జాడ కనిపెట్టాడు. సంజీవనీ పర్వతాన్నే పెకిలించి తీసుకొచ్చిన వీర హనుమాన్ శక్తియుక్తులను కీర్తించడం సాధ్యమా?! బుద్ధిలో శ్రేష్ఠుడు,రాక్షస సంహారకుడు, మహాబలవంతుడు, మహా ధీ మంతుడుశ్రీరామ భక్తాసురుడు, అంజనీసుతుడు, భక్తుల పాలిట కల్పవృక్షం, వాయుపుత్రుడుగా అభివర్ణిస్తున్నారు. హనుమజ్జయంతి సందర్భంగా పంచముఖ హనుమాన్, పాదరస హనుమాన్ తదితర విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసారు. హనుమంతుడు అంతులేని పరాక్ర మశాలి అయ్యుండీ రాముడి సేవలో గడపడానికే ప్రాధా న్యత ఇచ్చాడు. ఆంజనేయునికి శ్రీరాముడంటే ఎంత భక్తిప్రపత్తులు అంటే, తన మనసునే మందిరంగా చేసి ఆరాధించాడు. హనుమంతుడు గుండె చీల్చి చూపగా సీతారాములే దర్శనం ఇచ్చారు. శ్రీరాముని, సీతమ్మతల్లి కంటే మిన్నగా ప్రేమించాడు, హనుమంతుడుఒకసారి హనుమాన్ సీతాదేవి నుదుట సిందూరం పెట్టుకోవడం చూసి," నుదుట సిందూరం ఎందుకు పెట్టుకున్నా వమ్మా" అని అడుగుతాడు. సీతమ్మతల్లి నవ్వుతూ "శ్రీరాముడు దీర్ఘాయుష్మడిగా ఉండాలని" అంటుంది. అంతే, హనుమంతుడు క్షణం ఆలోచించకుండా తన ఒళ్ళంతా సిందూరం పూసుకుంటాడుని అంటున్నారు. అదీ హనుమంతునికి రాముడి మీద గల నిరుపమానమైన భక్తి. హనుమంతుని భక్తికి ఇలాంటి తార్కాణాలు ఎన్నో! ఒక సందర్భంలో సీతమ్మ హనుమంతునికి రత్నాభరణాన్ని బహూకరించింది. హనుమంతుడు ఒక్కో పూసనూ కొరికి చూసి, విసిరేయసాగాడు. అదేమిటని అడగ్గా, "రామయ్య తండ్రి కనిపిస్తాడేమోనని ఆశగా చూశాను. నా స్వామి లేని రత్నాలు, స్వర్ణాలతో నాకేంపని అన్నాడు. హనుమంతుని నిరుపమానమైన భక్తికి ఇంతకంటే కొలమానం ఇంకేం కావాలి. శ్రీరాముని నమ్మినబంటు అయిన హనుమంతుడు బలానికి, ధైర్యానికి ప్రతి రూపం. హనుమంతుని ఆరాధించడంవల్ల ధైర్యం,స్థైర్యం కలుగుతాయి. భయాలూ భ్రమలూ పోతాయి. చింతలు, చిరాకులు తీరతాయి. చేపట్టిన ప్రతి పనిలో విజయం చేకూరి, కీర్తిప్రతిష్టలు వస్తాయి. నిత్యం హనుమంతుని నామస్మరణ చేసేవారికి ఎలాంటి ఆందోళనా దరిచేరదు. సదా ఆనందంగా ఉంటారు. ఇక హనుమజ్జయంతి విశేష దినాన మరింత భక్తిశ్రద్ధలతో హనుమంతుని అర్చిస్తారు.మండలంలో ఓనె మగ్గూరు, వంగర, ఎం.సీతారాంపురం, మద్దు వలస, రాజులగుమ్మడ, తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతినిఘనంగా నిర్వహించారు.

అనుమతులు లేకుండా ప్రభుత్వ బందలో చెట్లను నరికి పూడికతీత పనులపై కేసులు నమోదు

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణం మిలటరీ కాలనీ ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువన ప్రభుత్వ బంధ లో అనుమతి లేకుండా పూడిక పనులు చేస్తున్న జెసిబి వాహనాన్ని రెవిన్యూ ఇన్స్పెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ఆదేశాల మేరకు గ్రామ రెవెన్యూ అధికారులు మల్లంపేట రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఇందిరమ్మ కాలనీ వీఆర్వో గొల్లపల్లి లలిత లు పనులు నిలుపుదల చేసి అనుమతులు లేకుండా ప్రభుత్వ చెరువులో పూడిక పనులు ఏ విధంగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పూడిక పనులు నిలుపుదల చేసి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ కళ్యాణ్ చక్రవర్తికి ఫిర్యాదు చేశారు. పూడికతీత పనులు పట్టణము కు చెందిన చేపల వ్యాపారి గోవిందరావు చెరువులో పూడిక తీత చేయమని పనులు అప్పగించినట్లు జేసిబి డ్రైవర్ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రభుత్వ చెరువుల్లో చెట్లు కొట్టడం పూడికి తీత పనులు చేయడం చట్ట విరుద్ధమని మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి హెచ్చరించారు. జేసిబి వాహనం యజమాని గొల్లపల్లికి చెందిన కోటేశ్వరరావు పై కేసు నమోదు చేస్తున్నట్లు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ విలేకరులకు తెలిపారు.